www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 1 డిసెంబరు 2022

5

పశ్చిమ గోదావరి



ఎన్వోజైమ్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రొయ్యల రైతులకు అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను భారత ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక అవార్డు ఈ ఏడాది తమ సంస్థకే దక్కిందని ఎన్వోజైమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ వీరన్న సింగులూరి తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరన్న వివరాలను వెల్లడించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్ సెక్రటరీ టూ ద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జతీంద్రనాథ్ స్వైన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నామన్నారు. ఆక్వా హెల్త్ కేర్, ఫీడ్ క్వాలిటీలో రాజీపడకుండా ఉత్పత్తులు అందజేస్తూ రొయ్యల రైతులకు అధిక దిగుబడులు సాధించేలా ఆరోగ్య కరమైన ఫైటోబయోటిక్‌తో కూడిన రొయ్యల మేతను తయారు చేసినందుకు గాను బెస్ట్ ఫిషరీస్ ఎంటర్ ప్రెన్యూర్ విభాగంలో ఈ అవార్డు అందజేశారన్నారు. తమ సంస్థకు అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రవి చేప, ఎజిఎం ఎం.గుబ్బల శ్రీపతి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఉక్కుపాదం

విజయవాడ ధర్నాకు వెళ్లనీయకుండా అడ్డంకులు

జిల్లాలో 15 మంది గృహ నిర్బంధం, మరో 15 మందికి నోటీసులు

తెల్లవార్లు పోలీస్ స్టేషన్లోనే యుటిఎఫ్ నేత గోపీమూర్తి



భీమవరంలో..

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. విజయవాడ ధర్నాకు వెళ్లనీయకుండా తీవ్ర అడ్డంకులు సృష్టించింది. రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తూ ప్రభుత్వం మరోసారి ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరించింది. 30న యుటిఎఫ్ ఆధ్వర్యాన విజయవాడలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ధర్నాకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ ధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నేతలను విజయవాడ వెళ్లనీయకుండా నిర్బంధించింది. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, వీరవాసరం, నరసాపురం, పెనుగొండ, పెనుమంట్ర ప్రాంతాల్లో 15 మంది ఉపాధ్యాయులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మరో 15 మంది ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారు. ఉపాధ్యాయులను ఎక్కడికి వెళ్లనీయకుండా అడుగడుగునా ఆంక్షలు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తిని భీమవరం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించారు. ఇంటికి వెళ్లనీయకుండా రాత్రంతా స్టేషన్‌లోనే ఉంచి ఇబ్బందులకు గురి చేశారు. వణికిస్తున్న చలిలో బల్లపై దోమల మధ్య గోపీమూర్తి రాత్రంతా గడిపారు. ఎట్టకేలకు బుధవారం ఆయనను విడిచిపెట్టారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులపై నిర్బంధం మోపడాన్ని యుటిఎఫ్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించింది.


మొగల్తూరు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలో చేపట్టిన ధర్నా సందర్భంగా అక్కడ మొగల్తూరుకు చెందిన పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతపల్లి కృష్ణమోహన్, పలువురు ఉపాధ్యాయులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

నిరసన జాగరణ దీక్ష


యుటిఎఫ్ వినూత్న నిరసన

భీమవరం: ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన జాగరణ దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం రాత్రి యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ఈ దీక్ష చేపట్టి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా కార్యదర్శులు కె.శ్రీరామకృష్ణప్రసాద్, నేతలు సిహెచ్.కుమార్‌బాబ్జి, పి.రమణరాజు, కె.త్రిమూర్తులు, జి.అబ్రహం, జి.మురళీధర్, సీతరామరాజు, బివి.కృష్ణ, ప్రేమరాజు, శ్రీమన్నారాయణ, శివరామరాజు, భాషా, అమీర్, సింహాచలం పాల్గొన్నారు.

పాలకొల్లు: ప్రభుత్వ తీరును నిరసిస్తూ యుటిఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యాన సమతా మహిళా భవనంలో బుధవారం సాయంత్రం నిరసన జాగరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే అక్రమంగా అరెస్టు చేసిన ఉపాధ్యాయులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, నేతలు పిల్లి శ్రీనివాస్, వి.జగ్గారావు, జె.వెంకటరమణ, ఎంవి.రాజశేఖర్, ఇడివి.ప్రసాద్, కె.శ్రీనివాసన్, గుబ్బల రామచంద్రరావు, జయ దుర్గారావు, జి.విజయలక్ష్మి, బి.శైలజ, ఎ.రాణి, పి.సూర్యప్రకాశరావు, పి.వెంకన్నబాబు, ఎం.రాంబాబు, ఎం.బాపిరాజు పాల్గొన్నారు.



పాలకొల్లులో..



తాడేపల్లిగూడెంలో..

తణుకురూరల్: ఉపాధ్యాయుల ఆందోళనపై ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ తణుకు బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో జాగరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేత దేవదత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా

తాడేపల్లిగూడెం: ఉపాధ్యాయుల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడాన్ని నిరసిస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నేతలు కెవి.రామకృష్ణ, వెంకన్న సాహెబ్, కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు వివరిస్తూ.. విమర్శలు గుప్పిస్తూ..!

ఏలూరు జిల్లాలో తొలిరోజు చంద్రబాబు పర్యటన

కలపర్రు టోల్‌గేట్ వద్ద ఘనస్వాగతం

దెందులూరు ఎంఎల్ఎ లండన్ బాబు అంటూ తీవ్ర విమర్శలు

ఫ్లెక్సీల వివాదంతో టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ



అభివాదం చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, చింతలపూడి


వైసిపి పాలనపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ప్రస్తుత పాలనలో జనం ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఏలూరు జిల్లాలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' పేరిట మాజీ సిఎం, టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన పర్యటన తొలిరోజు బుధవారం సాగింది. ఉదయం 11.20 గంటలకు చంద్రబాబు కలపర్రు టోల్‌గేట్‌కు చేరుకునేసరికి అక్కడికి పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. చంద్రబాబుకు గజమాలతో టిడిపి శ్రేణులు స్వాగతం పలికాయి. ఓపెన్ టాప్ వాహనంపై చంద్రబాబు అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం బైక్‌ర్యాలీగా కార్యకర్తలు ముందు సాగగా వెనుక చంద్రబాబు కాన్వాయ్ కదిలింది. జానంపేట మీదుగా మధ్యాహ్నం రెండున్నర గంటలకు ర్యాలీ విజయరాయి చేరుకుంది. మార్గమధ్యంలో మహిళలు హారతులిచ్చి చంద్రబాబుకు స్వాగతం పలికారు. విజయరాయి గ్రామంలోకి చేరుకోగానే జనం పెద్దఎత్తున చేరుకోవడంతో కాన్వాయ్ ముందుకెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. జనం పెద్దఎత్తున రావడంతో చంద్రబాబు ఉత్సాహంగా తన పర్యటన సాగించారు. విజయరాయిలో తొలుత పలువురి ఇళ్లకు వెళ్లి ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి హయాంలో కట్టిన ఇంటికి ఇంకా రూ.లక్షకుపైగా రావాల్సి ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం ఇవ్వలేదని ఓ మహిళ తెలిపింది. మరో మహిళ తమకున్న రెండు ఎడ్లలో ఒక ఎద్దు వైరెస్‌తో చనిపోయిందని చెప్పగా మరో ఎద్దును కొనుగోలు చేసి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక సెంటరులోని బహిరంగ సభ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాకు కొన్ని వందలసార్లు వచ్చానని, ఇటువంటి స్పందన మాత్రం ఎప్పుడూ చూడలేదని చంద్రబాబు అన్నారు. స్కూల్ పిల్లలు బయటికి రాకుండా గేట్లు వేసినా వారి స్పందనను ఆపలే కపోయారన్నారు. దెందులూరు ఎంఎల్ఎ అబ్బాయి చౌదరిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇక్కడ లండన్‌బాబు ఉన్నాడని, మళ్లీ శాశ్వతంగా లండన్ పంపిస్తామని అన్నారు. ఏ పార్టీతో పెట్టుకుంటున్నావో గుర్తుపెట్టుకో అంటూ హెచ్చరించారు. తాడేపల్లిలో ఒక సైకో.. ఇక్కడ ఒక సైకో తయారయ్యాడన్నారు. ప్రజల్లో చైతన్యం తేవడానికి 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నానన్నారు. కరెంటు, ఆర్‌టిసి ఛార్జీల పెంపు, నిత్యావసరాలు, వంటనూనె, పెట్రో, డీజిల్, మద్యం ధరలు పెరుగుదలతో జనం పడుతున్న సమస్యలను వివరించారు. పోలవరంను రివర్స్ టెండరింగ్ పేరుతో దెబ్బతీశారని తెలిపారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిచేసి నీటిఎద్దడి లేకుండా చేద్దామనుకున్నానని, దాన్ని పక్కన పెట్టేశారని అన్నారు. చింతమనేనిపై 29 కేసులు పెట్టారని, అందులో 14 అట్రాసిటీ కేసులు పెట్టారని తెలిపారు. మోటార్లకు మీటర్లు పెట్టి ఉరితాళ్లు వేస్తారట అని విమర్శించారు. పోలీసుల మెడపై కత్తిపెట్టి పనులు చేయిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని తిరిగి నిలబెడతానని, పూర్వ వైభవం తెస్తానని, అది తన బాధ్యత అని తెలిపారు.

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వైసిపి నాయకులు పెట్టిన ప్లెక్సీలు వివాదస్పదమయ్యాయి. 'ఇదే మా అదృష్టం.. చంద్రబాబు నువ్వే మా ఖర్మ' అంటూ చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా ఫొటోలతో చింతలపూడి, ఫాతిమాపురంలో వైసిపి నాయకులు ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో చంద్రబాబు పర్యటన సాగుతుండగా కరెంట్ సరఫరా నిలిచిపోవడం వివాదాస్పదమైంది. ధర్మాజీగూడెంలో కొంతమంది యువకులు రోడ్డుపైకి వచ్చి పర్యటన వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ధర్మాజీగూడెంలో బాలికలతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. రాత్రి చింతలపూడిలో బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. అనంతరం కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం చేరుకుని దండమూడి రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆయన బస చేశారు.

నేడు పర్యటన ఇలా..

రెండో రోజు గురువారం చంద్రబాబు పర్యటన దండమూడి ఫంక్షన్ హాల్ వద్దనుంచి పోలవరం వరకూ సాగనుంది. బయ్యన్నగూడెం, కొయ్యలగూడెం, రేపల్లెవాడ, దిప్పకాయలపాడు, తంగేళ్లపాడు, కండ్రిగగూడెం, కన్నాపురం మీదుగా సాగి పోలవరంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడనున్నారు. అనంతరం కొవ్వూరు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన సాగనుంది.

జగనన్న విద్యాదీవెన పేద విద్యార్థులకు వరం : కలెక్టర్



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న విద్యా దీవెన పథకం పేద విద్యార్థులకు వరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం జిల్లాలోని 37,084 మంది విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద రూ.25.54 కోట్ల నమూనా చెక్కును కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ మొత్తాన్ని 32,823 మంది తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలనే లక్ష్యంతో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులకు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని జగనన్న విద్యా దీవెన పథకం కింద అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 6,547 ఎస్‌సి విద్యార్థులకు రూ.4.16 కోట్లు, 195 మంది ఎస్‌టి విద్యార్థులకు రూ.11 లక్షలు, 17,148 మంది బిసి విద్యార్థులకు రూ.11.16 కోట్లు, 3,560 మంది ఇబిసి విద్యార్థులకు రూ.3.57 కోట్లు, 8,427 మంది కాపు విద్యార్థులకు రూ.6.15 కోట్లు, 390 మంది మైనార్టీ విద్యార్థులకు రూ.31 లక్షలు, 817 మంది క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.56 లక్షలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ అధికారి కె.శోభారాణి, జిల్లా ఎస్‌టి వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ అధికారి డి.పుష్పరాణి, వివిధ కళాశాల విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభకు సిద్ధమవుతున్న భీమవరం

ముమ్మరంగా సాగుతున్న గోడ రాతలు, అలంకరణ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు భీమవరం సిద్ధమవుతోంది. మహాసభకు సంబంధించిన ప్రచార గోడ రాతలు, అలంకరణలు ప్రారంభమయ్యాయి. ఈ పనులను జిల్లా, పట్టణ నాయకులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ రైతులు, దళితులు, మహిళలు ఇలా అనేక తరగతుల పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ సాగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభ మొట్టమొదటిసారిగా భీమవరంలో జరుగుతుందని చెప్పారు. మహాసభ నేపథ్యంలో వివిధ రంగాల కార్మికుల, ప్రజల సమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాజాతాలు, పాలకులు అవలంబిస్తున్న విధానాలు, వాటి పర్యవసానాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ సాగేలా మహాసభ ప్రచారం సాగుతుందని తెలిపారు. ఈ మహాసభకు అఖిల భారత, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారన్నారు. ఆక్వా, రైస్‌మిల్లు వంటి రంగాలు ఈ కాలంలో కుదేలై ఆయా రంగాల్లో పని చేస్తున్న కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు గిట్టుబాటు ధర లేక విలవిల్లాడుతున్నారన్నారు. రానున్న కాలంలో ఈ సమస్యలన్నింటిపై ఆందోళన, పోరాట కార్యక్రమాలను రూపొందించడం కోసం ఈ మహాసభలో చర్చ సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కోదండం పాల్గొన్నారు.

మేం గడగడపకూ తిరుగుతుంటే అధికారులు రారా

ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ గైర్హాజరుపై ఎంఎల్ఎ చెరుకువాడ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను గ్రామాల్లో తిరుగుతుంటే అధికారులు వీడియో కాన్ఫరెన్స్ పేరుతో కార్యక్రమానికి గైర్హాజర్ కావడంపై ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సత్యవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యపై ప్రజలు పదేపదే అడగ్గా ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ లోకేష్‌ను ఎంఎల్ఎ పిలిచారు. అయితే ఆయన రాలేదని ఇతరులు చెప్పడంతో రెండు రోజులుగా ఎఇ ఎందుకు రావడం లేదంటూ ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారని సిబ్బంది తెలిపారు. ఎంఎల్ఎ చెరుకువాడ కలెక్టర్ ప్రశాంతికి ఫోన్ చేసి ఎఇ తీరును వివరించారు. అనంతరం ఎంపిడిఒ పూర్ణబాబ్జికి ఫోన్ చేసి ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. క్రమశిక్షణ చర్యగా కలెక్టర్‌కు లెటర్ రాసి సస్పెండ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు నల్లిమిల్లి ప్రభాకర్‌రెడ్డి, జెడ్‌పిటిసి కర్రి గౌరీసుభాషిణి, పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు), ఎంపిటిసి గడ్డం ఈశ్వరుడు, తాళ్లూరు చంటి, బల్ల శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించడంతోపాటు అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బొండాడ గ్రామ సచివాలయాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన సేవలందించాలన్నారు. సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజల నుంచి అందిన అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. సచివాలయ పరిధిలో ప్రతిరోజూ ఎన్ని అర్జీలు వస్తున్నాయి, వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని బియాండ్ ఎస్‌ఎల్‌ఎలో ఉన్నాయనేది ఆమె సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్‌ను కలెక్టరు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, విఆర్ఒ అమిరపు రాధాకష్ణ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చే సాధనమే సోషల్ మీడియా

ఎస్ఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ కారుసాల శ్రీనివాసరావు




మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాల విధానాలపై ప్రజలను చైతన్యపర్చే సాధనమే సోషల్ మీడియా అని ఎస్ఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ కారుసాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా 'ప్రభుత్వాల విధానాలు-ప్రజలపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రాపాక రాజీవ్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి కారుసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అమలులో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాను మోడీ వినియోగించుకుని ఎన్నికల్లో గెలిచారన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలు పీకేసే పనిలో ఉందన్నారు. ఫలితంగా నేడు దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలపై భారం పెరిగిపోయిందన్నారు. ఎన్నడూ లేనంతగా ఎన్నికల ప్రచారాన్ని డిజిటలైజ్ చేసి యువతను పక్కదారి పట్టించారన్నారు. దేశంలో ముందుకొస్తున్న ప్రజా సమస్యలను వెలుగులోకి రానీయకుండా దానికి వ్యతిరేకమైన వాటిని ముందుకు తెస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. పెయిడ్ బ్యాచ్‌తో వాస్తవాలను, చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సోషల్ మీడియా పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయన్నారు. సోషల్ మీడియా వేదికగా ఉండేవారు ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజా సమస్యలను వెలికితీసి, వాటి పరిష్కారం కోసం సోషల్ మీడియా వేదికగా మారాలన్నారు. సిఐటియు సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు నూర్‌మహ్మద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో సిఐటియు పోరాడుతుందని తెలిపారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్నాయన్నారు.

దశలవారీ పోరాటాలకు సమాయత్తం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో సామాన్య ప్రజానీకంతోపాటు అన్ని తరగతుల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని, ఆ సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ పోరాటాలకు సమాయత్తమవుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. డిసెంబర్ 5న ఎటువంటి షరతులూ లేకుండా టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలని, జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, 12న వరి, ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఐ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కనుమరుగైందని, అప్పులు కుప్పగా మారిందని విమర్శించారు. రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, రైతులు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. ఆక్వా రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారిందన్నారు. కడప జిల్లాకు చెందిన ఐదారుగురు చేతిలో రాష్ట్రాన్ని పెట్టారని విమర్శించారు. వైసిపి అధికారం చేపట్టక రాష్ట్రంలో సమస్యపై మాట్లాడే హక్కు లేదని, కనీసం బ్యానర్ పెట్టుకోడానికి కూడా అనుమతించకపోవడం దారుణమని అన్నారు. పోలీసులు సైతం వైసిపి ఏజెంట్లుగా పని చేస్తున్నారని ఆరోపించారు. మూడు రాజధానుల పేరిట అటు ఉత్తరాంధ్ర, ఇటు రాయలసీమ ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. కులానికో కార్పొరేషన్ పెట్టారే తప్ప వారికి ఎటువంటి కార్యాలయాలు లేవని, కనీసం కుర్చీ కూడా లేదని అన్నారు. సమావేశంలో సిపిఐ నేతలు వనజ, నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకటరావు, నెక్కంటి జగదాంబ, సికిలే పుష్పకుమారి, సీతారాం ప్రసాద్, చెల్లబోయిన రంగారావు, కె.మల్లేశ్వరి, బండి వెంకటేశ్వరరావు, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో సబ్‌కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - పెనుగొండ

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతుల నుంచి ధాన్యాన్ని ఏ విధంగా సేకరిస్తున్నారో టెక్నికల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల దృష్ట్యా తేమ శాతం ఎంతున్నా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ డిబికె కృష్ణంరాజు, తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి, ఆర్‌ఐ కిరణ్ కుమార్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడెంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం:డయాబెటిస్‌ను అశ్రద్ధ చేయొద్దని పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్, లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షులు లయన్ కొనా హనుమాన్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని స్థానిక ఆర్‌అండ్‌బి వాకర్స్ గ్రౌండ్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు, స్థానికులకు ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. లయన్ మురళీకృష్ణ పర్యవేక్షణలో జిల్లాలో పలు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు హనుమాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల జితేంద్ర, బెజవాడ రాంబాబు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - ఉండి

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం అందుతుందని ఉండి పిహెచ్‌సి డాక్టర్ పంజా ధర్మతేజ అన్నారు. వాండ్రం గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం తరహాలోనే ప్రభుత్వ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది సిబ్బంది కృష్ణకుమార్, ఎంఎల్‌హెచ్‌పి పి.సోమన్న రెడ్డి, ఎఎన్ఎం యూనిస్ లక్ష్మి పాల్గొన్నారు.

వెలివెలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వెలివెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచి కెల్లా సింహాచలం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుండి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తుందని, బస్తాకు రూ.1,530 గిట్టుబాటు ధర నిర్ణయించిందని తెలిపారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉండే విధంగా చూస్తామని తెలిపారు. ధాన్యం రవాణా ఛార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఓ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్ రవికిరణ్, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆకివీడు


వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని సిఐ గీతా రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ స్పెషల్ పోలీస్ మోటార్ సైకిల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 18 మంది వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించారని తెలిపారు. కొందరు నెంబర్ ప్లేట్స్ లేకుండా, ఇంకొందరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మరికొందరు ముగ్గురు, నలుగురు, ఐదుగురు ప్రయాణించారని వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.

కొడమంచిలిలో సివిల్ రైట్స్ డే

ఆచంట :కొడమంచిలి చినపేటలో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడుతూ కొడమంచిలి వంటి గ్రామాల్లో కుల ప్రాతిపదికన పరిపాలన కొనసాగుతోందన్నారు. కుల నిర్మూలనకు అన్ని వర్గాలవారు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు గ్రామాల్లో ఇంకా ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలంటే చులకన భావన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నజీరుముల్లషా, ఎస్ఐ బిఎస్‌డిఆర్. ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ.63 లక్షలతో అభివృద్ధి పనులు

ఉండి:రూ.63 లక్షల నిధులతో మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రణస్తుల కనకదుర్గ మహంకాళి అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉండి మెయిన్ సెంటర్ నుండి ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామానికి వెళ్లే సిమెంట్ రోడ్డును ఆక్రమించి గోడ కట్టడంతో రోడ్డు ఇరుగ్గా మారిందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. ఈ గోడ వల్ల ఉండి నుండి అగ్రహారం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మాట్లాడుతూ గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో రూ. 5.29 కోట్ల రూపాయలను జల జీవన్ మిషన్ ద్వారా మండలానికి కేటాయించామన్నారు. వ్యవసాయ అధికారి సంధ్య మాట్లాడుతూ ఇప్పటివరకు 16 ఆర్‌బికెల ద్వారా 210 మంది రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వి.రాధాకృష్ణ

సమానత్వం కోసం గురజాడ పోరు

ప్రజాశక్తి - భీమవరం

దేశభక్తి జీవన విధానంగా.. ఒక దేశం అభివృద్ధి చెందే ప్రణాళికను దేశభక్తి గేయంగా అందించిన మహాకవి గురజాడ అప్పారావు అని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వి.రాధాకృష్ణ అన్నారు. బుధవారం గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా డాక్టర్ సిఎస్ఎన్ జూనియర్ కళాశాలలో సభ నిర్వహించి ఘన నివాళులర్పించారు. ముఖ్యవక్త రాధాకృష్ణ మాట్లాడుతూ గురజాడ రచించిన 'దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా అనే గీతం జాతీయగీతంగా, విశ్వగీతంగా గుర్తింపు పొందాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తెలుగు సాహిత్యాన్ని తన వ్యవహారిక భాష ద్వారా సుసంపన్నం చేసిన ఘనత గురజాడకే దక్కుతుందన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం లక్షలాది ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ సలీంఖాన్ మాట్లాడుతూ సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా గురజాడ రచనలు చేశారన్నారు. ఆయన రచనలు ఎంతో అభ్యుదయ మైనవని, మహిళలు, బాలికల హక్కుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. సాహితీ స్రవంతి కార్యదర్శి చైతన్యప్రసాద్ మాట్లాడుతూ సంఘసంస్కర్త గురజాడ అప్పారావును మార్గదర్శకంగా తీసుకుని అసమానతలపై పోరాడాలన్నారు. దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా.. గేయాన్ని పాడి విద్యార్థులను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు:మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ ఎం.రామ దుర్గాకిరణ్ తెలిపారు. పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో మహాకవి గురజాడ వర్ధంతిని హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ రామ దుర్గాకిరణ్ మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అన్నారు. కన్యాశుల్కం నాటకంతో ప్రపంచానికి తెలుగు సాహిత్యం గొప్పతనాన్ని పరిచయం చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ కోఆర్డినేటర్ జనార్ధన్, చిలుకూరి భీమన్న, కెల్ల పెద్దిరాజు, చల్లా ముత్యం పాల్గొన్నారు.

సమస్యలపై పురోగతి లేదు

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని సమస్యలను ఎన్నిసార్లు కౌన్సిల్లో చర్చించినా పురోగతి ఉండడం లేదని పలువురు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో వార్డు సమస్యలను తెలిపినా వాటిని పరిష్కరించేందుకు మున్సిపల్ అధికా రులు, సిబ్బంది స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యుద్దీపాలు, డ్రెయినేజీ, పారిశుధ్యం, తాగునీటి సమస్యలను ప్రస్తావించారు. 18, 19, 23వ వార్డుల్లో కొద్దిపాటి వర్షానికే రోడ్లు ముంపునకు గురవుతున్నాయని, ఆయా వార్డుల్లో డ్రెయినేజీలను హైవే డ్రెయినేజీకి రంధ్రాలు పెట్టి అనుసంధానం చేయాలన్నారు. అనంతరం అజెండాలో అంశాలను చదివించి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

నరసాపురం టౌన్:కొప్పర్రు పంచాయతీలో ముగ్గు, బ్లీచింగ్‌లో అక్రమాలు జరిగాయని, మంచినీటి చెరువులోకి నీటిని తోడకుండా తోడినట్లు చూపించారని ఇటీవల స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు బుధవారం దర్యాప్తు చేపట్టారు. పంచాయతీలో 14, 15 ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ సాధారణ నిధుల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన యాదంరెడ్డి సూరిబాబు, పిఎసిఎ ఛైర్మన్, ఉప సర్పంచి అందేకవి కుమార్ ఇటీవల స్పందనలో పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. అన్ని రికార్డులను పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపిడిఒ శివ ప్రసాద్ యాదవ్, ఇఒపిఆర్‌డి నాగేశ్వరరావు ఉన్నారు.

ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ప్రజాశక్తి - వీరవాసరం

నందమూరుగరువు ఆంజనేయస్వామి ఉత్సవాల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ చర్యలు తీసుకోవాలని సిఐ నాగప్రసాద్ సూచించారు. నందమూరుగరువు ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఈనెల ఐదో తేదీ నుంచి భారీ ఎత్తున ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ సుందరాజు, ఎస్ఐ రమేష్, ఫైర్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్న సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఉత్సవాల జరిగే ప్రాంతమంతా సిసి కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటే జెయింట్‌వీల్ ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. భీమవరం ఫైర్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ కరెంటుకు సంబంధించి జాయింట్లు లేని వైరింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం నిర్మూలకు అన్ని చర్యలూ తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

జగనన్న విద్యా దీవెన చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

ప్రతి విద్యార్థీ ప్రభుత్వం అందించే మెరుగైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. జగనన్న విద్యా దీవెన నాలుగో విడత పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఎం.చిత్రకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో 5435 మంది విద్యార్థులకు 3,66,57,200 రూపాయలు విలువ చేసే జగనన్న విద్యా దీవెన చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రణస్థుల మహంకాళి, కమతం బెనర్జీ, ఉండి మండల అభివృద్ధి అధికారి అడబాల వెంకట అప్పారావు, ఉండి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ముఖ్యమంత్రి అందించే విద్యా దీవెన పథకం వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పెనుగొండ, ఆచంట ఎఎంసి ఛైర్మన్లు వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), చిల్లె లావణ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ సాయి జగనన్న విద్యా దీవెన నిధులు పంపిణీ కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎంవి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపిడిఒ పూర్ణ బాబ్జి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 37,084 మంది విద్యార్థులకు రూ.25 కోట్ల 54 లక్షలు, నియోజకవర్గంలో 5,494 మంది విద్యార్థులకు రూ.3 కోట్ల 44 లక్షల 41 వేల 734, మండలంలో 1,251 మంది విద్యార్థులకు రూ.87 లక్షల 16 వేలు అందజేసినట్లు తలెఇపారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర సర్పంచి తాడిపత్రి ప్రియాంక, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు), గరువు, మాముదూరు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా చివరి రోజున పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు అన్నారు. బుధవారం పాములపర్రు గ్రామ సచివాలయంలో ప్రజా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. ప్రతి పౌరుడూ తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి జి.ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో దర్శకుడు త్రివిక్రమ్

ప్రజాశక్తి - కాళ్ల



కాళ్ల : దర్శకుడు త్రివిక్రమ్‌ను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

కాళ్లకూరులో శ్రీవెంకటేశ్వర స్వామిని ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను సత్కరించారు. స్వామివారి జ్ఞాపికను బహూకరించారు. ధర్మకర్త సభ్యులు కృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పట్టణంలోని మావుళ్లమ్మ వారిని ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ అధికారులు సత్కరించారు. ఆలయ ధర్మకర్తలు అమ్మవారి ప్రతిమను శ్రీనివాస్ కు అందజేశారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఆచంట :క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరసింహరాజు అన్నారు. కొడమంచిలిలో జిల్లా స్థాయిలో ఏర్పాటుచేసిన వాలీబాల్ టోర్నమెంట్ నరసింహరాజు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడలు యువకుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడతాయన్నారు. నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఎఎంసి మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, పెనుమంట్ర, పోడూరు జెడ్‌పిటిసిలు కర్రి గౌరీ సుభాషిణి, గుంటూరి పెద్దిరాజు, పోడూరు ఎంపిపి సబ్బితి సుమంగళి పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం లక్ష్మణేశ్వరంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరితి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రాజు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా సిఎం జగన్ ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. అర్హత కలిగి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందనట్లయితే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం గ్రామంలోని గొల్లల వంతెన వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : ప్రజల కోసమే సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. కలవపూడిలో చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నాటికి 105వ రోజుకు చేరుకుంది. అనంతరం పివిఎల్ నరసింహరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తెవాలన్నారు. మోడీ గ్రామంలో రూ.15 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మోడీ, కలవపూడి గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. జెడ్‌పిటిసి నిధులు రూ.25 లక్షలు మంజూరయ్యాయని, పనులు చేపట్టాల్సి ఉందని తెలిపార. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, కలవపూడి సొసైటీ ఛైర్మన్ పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయ రామకష్ణంరాజు, సొసైటీ డైరెక్టర్ మంతెన చిన్న నరసింహరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్నరాంబాబు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో కారుమూరి దంపతులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని మావుళ్లమ్మను రాష్ట్ర పౌర సరఫరా శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమీషనర్ యర్రంశెట్టి భద్రాజీ ప్రసాదం అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తలు ముత్యాల రామారావు రామాయణం, సత్యనారాయణ సిహెచ్ శేషగిరి గోపిశెట్టి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామంలో క్రిస్టియన్ పేటకు చెందిన రాపాక భాగ్యరాజు (24) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందినట్లు కాళ్ల పోలీసులు బుధవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. భాగ్యరాజు భీమవరంలోని ఓ పెట్రోల్ బంక్‌లో తన అన్నతో కలిసి ఏడేళ్ల నుంచి పని చేస్తున్నాడు. అతని తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. తండ్రి నాగబాబు మరో కుమారుడితో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఏంజరిగిందో గాని మంగళవారం సాయంత్రం భాగ్యరాజు ఇంట్లో ఉరేసుకునే మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : ఎంఎల్ఎ



ఎన్నికైన కాలువ వెంకట్రావును అభినందిస్తున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

తెలుగుదేశం పార్టీ కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పెదఅమిరం టిడిపి నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ గ్రామాల్లో టిడిపి బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి పెదఅమిరం గ్రామ అధ్యక్షుడిగా పనిచేసిన గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఇటీవల వైసిపిలో చేరడంతో గ్రామ అధ్యక్షుడి పదవికి ఎన్నిక నిర్వహించాల్సి వచ్చిందన్నారు. పెదఅమిరంలో తెలుగుదేశం పార్టీ సీనియర్, జూనియర్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉందని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, తోట ఫణిబాబు, బుధుడు ఉషాకుమారి, కేతా శ్రీనివాస్, ముదుండి వెంకటరాజు పాల్గొన్నారు. అయితే పెదఅమిరంలో 24 సంవత్సరాలుగా టిడిపిలో కొనసాగుతున్న కాలువ వెంకట్రావును అధ్యక్షులుగా చేయాలని ఎక్కువమంది సూచించారు. వెంకట్రావు గతంలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం నేతలు పెదఅమిరం గ్రామ అధ్యక్షుడిగా కాలువ వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అలుగు కృష్ణాఫర్, ఉపాధ్యక్షులుగా వేగేశ్న మురళీరాజు, ప్రధాన కార్యదర్శిగా బూరాడ వెంకటకృష్ణ, ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను టిడిపి నేతలు అభినందించారు.

చేతగాకపోతే సెలవుపై వెళ్లండి..

మున్సిపల్ కమిషనర్‌పై ఎంఎల్ఎ గ్రంధి ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

'రెస్ట్ హౌస్ రోడ్డులో ఈ చెత్త ఏంటి, పైగా నాతోనే అబద్ధాలు చెబుతారా, పని చేతగాకపోతే సెలవుపై వెళ్లండి, మరోసారి పట్టణంలో చెత్త కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాను' అని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ ఎస్.శివ రామకృష్ణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ శ్రీనివాస్ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం దెయ్యాల తిప్ప గ్రామానికి వెళ్తున్న సమయంలో రెస్ట్ హౌస్ రోడ్డులో ముఖ్యంగా గంగానమ్మ గుడి ఏరియా వద్ద రోడ్డుపై చెత్త ఉండటం చూసి మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణకు ఫోన్ చేశారు. వెంటనే రెస్ట్ హౌస్ రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించి చెత్త తీయించాలని ఆదేశించారు. అయితే దెయ్యాల తిప్ప నుండి తిరిగి వస్తున్న సమయంలో గంగానమ్మ గుడి వద్ద ఇంకా చెత్త కనిపించడంతో ఎంఎల్ఎ కారు దిగి కమిషనర్‌కు ఫోన్ చేసి రమ్మన్నారు. అక్కడికి వచ్చిన కమిషనర్‌ను తాను ఫోన్ చేసి చెత్త తొలగించాలని చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ తాను ఇక్కడ వచ్చి వెళ్లానని అబద్ధం చెప్పడంతో ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి రాకుండానే వచ్చానని చెప్పడం, మరో పక్క కలెక్టర్ సమావేశానికి వెళ్లాలని చెప్పడం సరి కాదన్నారు. కలెక్టర్ పేరు అడ్డుపెట్టుకుని అబద్ధాలు చెప్పటం ఏంటని, పని చేతకాకపోతే సెలవుపై వెళ్లిపోవాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కెఎస్ఎన్.రాజు, దినకర్లపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్‌కు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే అధికారులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

మొగల్తూరు:మహిళలు ఆర్థికంగా బలపడాలని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. బుధవారం వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఎం.సుభాషిని ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘం సభ్యులకు ప్రభుత్వ సరఫరా చేసిన అసిల్ (నాటు) కోళ్లను పంపిణీ చేశారు. వంద మంది సభ్యులకు గాను ఒక్కొక్కరికి 15 కోళ్ల చొప్పున అందించామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మేరీ మాట్లాడారు. కార్యక్రమంలో సిసిలు సుదర్శన్, ఆనంద్ కుమారి పాల్గొన్నారు.

అఖిలభారత మహాసభలకు ప్రతినిధిగా క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

బీహార్ రాష్ట్రంలో జరగనున్న దళిత్ శోషన్ ముక్తిమంచ్ (డిఎస్ఎంఎం) అఖిల భారత మహాసభలకు తాను ప్రతినిధిగా వెళ్లనున్నట్లు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలు నవంబర్ 28, 29 తేదీలలో కర్నూలు జిల్లాలో జరిగాయని తెలిపారు. కెవిపిఎస్ అనుబంధ అఖిల భారత సంఘం డిఎస్ఎంఎం జాతీయ మహాసభలు ఈ నెల 3, 4, 5 తేదీల్లో బీహార్ రాష్ట్రంలోని బెగుసరాయి నగరంలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ జాతీయ మహాసభలకు అన్ని రాష్ట్రాల నుంచీ ముఖ్యనాయకత్వం హాజరవుతారని చెప్పారు. కర్నూలు జిల్లాలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఈ జాతీయ మహాసభలకు ఆంధ్ర రాష్ట్రం నుండి 23 మంది ప్రతినిధులను మహాసభ ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వారిలో జిల్లా నుంచి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న తనను ప్రతినిధిగా ఎన్నుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా దళితుల సమస్యలపై, కుల వివక్ష, అంటరానితనంపై మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు.

పిహెచ్‌సిలో మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పిహెచ్‌సి సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి తెలిపారు. లంకలకోడేరు పిహెచ్‌సి వద్ద డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, మెంబర్ కన్వీనర్‌గా డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, మెంబర్లుగా ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మమ్మీ, సర్పంచి చొప్పల రజిని, మరో సర్పంచి వాసా కనకబద్రం ఉంటారని తెలిపారు. ఎంపిపి కనకలక్ష్మి మాట్లాడుతూ పిహెచ్‌సి సిబ్బంది బాగా పని చేస్తున్నారన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు బాగా జరుగుతున్నాయన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ చేబోలు శ్రీనివాస్, ఫార్మసిస్ట్ పివి స్వామి పాల్గొన్నారు.